క్లుప్తంగా

రేషన్ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి



చౌకడిపోల డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: చౌకడిపోల డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వినియోగదారులకు రేషన్‌ను సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చౌక దుకాణాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులను తెరిచి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగానే వృద్ధులకు బియ్యాన్ని డీలర్లు ఇంటికి వెళ్లి అందించాలన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



అనుబంధ సంఘాల నేతలకు గుర్తింపు కార్డులు అందిస్తున్న దృశ్యం

కూడేరు: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతం చేయడానికి అనుబంధ సంఘాల నాయకులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ నారాయణరెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఇటీవల పార్టీలో మండల, నియోజక వర్గ, జిల్లా స్థాయిలో చోటు దక్కిన నేతలతో కూడేరులో పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించారు. ఎంపీపీ నారాయణరెడ్డి మాట్లాడారు. కూటమి పాలనతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతుందన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వంతో పోరాడి వారి సమస్యల పరిష్కారానికి అనుబంధ సంఘాల నేతలు కృషి చేయాలని సూచించారు. అనంతరం అనుబంధ సంఘాల నాయకులకు గుర్తింపుకార్డులు అందించారు.


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పీఎన్‌ఆర్

కణేకల్లు: మండలంలోని గెనిగెర జెడ్పీహైస్కూల్ నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి గురువారం ఘనంగా సన్మానించారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో బదిలీ వెళ్లిన హెచ్‌ఎం సుశీల, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి ఉషారాణి, రాజేశ్వరి, గోవిందులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు వారికి శాలువా కప్పి, పూలమాల లేసి సన్మానించారు. అనంతరం ఏర్పాటైన సభలో నాగిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సీతారామిరెడ్డి, రాఘువరెడ్డి, సుధారెడ్డి, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మహేష్

రాయదుర్గంటౌన్: యువత మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయని ఎక్సైజ్ సీఐ మహేష్ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యక్షతన «డ్రగ్స్ వద్దు బ్రో» అనే అంశంపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ సీఐతోపాటు ఎస్‌ఐ పవన్‌కుమార్ మాట్లాడారు. డ్రగ్స్ వద్దు...జీవితమే ముద్దు అనే విషయాన్ని యువత తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం : యువత అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని అర్బన్ హెల్త్ సెంటర్‌వైద్యుడు యశ్వంత్, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. రక్తదానంపై అపోహలు వీడి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణ

ఉరవకొండ: స్థానిక అనంతపురం బైపాస్ వద్ద అగ్నిమాపక శాఖ కార్యాలయం పక్కనే ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకొని బంకు ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా జేసీబీతో స్థలాన్ని శుభ్రం చేయించి, బంకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొందరు బళ్లారి బైపాస్ వద్ద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా బంకులు ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణంను అడగ్గా విచారణ చేసి బంకులను తొలగిస్తామన్నారు.

అన్నదాతకు బీమా భారం

- రైతులే చెల్లించాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లింపు



చిన్నముష్టూరు వద్ద సాగు చేసిన ఆముదం పంట

ఉరవకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు బాసటగా నిలిచింది. పల్లెల్లో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి, వాటి ద్వారానే అన్ని సేవలూ అందించింది. పెట్టుబడి సాయం నుంచి ఎరువులు, విత్తనాలు వరకు .. పరిహారం నుంచి ప్రోత్సాహకాలు వరకు అందించి.. అన్ని రకాలుగా వెన్నుదన్నుగా నిలిచింది. ప్రభుత్వమే రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లించి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుల సంక్షేమాన్ని విస్మరించింది. మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 11 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఈ సీజన్‌లో వేరుశనగ, కంది, ఆముదంతో ఇతర అనేక రకాల పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో బోరు బావుల కింద మరికొన్ని పంటలు సాగు చేస్తున్నారు.

రైతులపై బీమా భారం

గత ఏడాది కాస్తో కూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం.. ఈ ఏడాదైనా ఆదుకుంటుందనుకున్న రైతన్నల ఆశలపై నీళ్లు చల్లింది. ఒక్కో పంటకు ఒక్కో రకంగా ప్రీమియం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వేరుశనగకు ఎకరాకు రూ.560, వరికి రూ.84, కందికి రూ.80 చొప్పున ప్రీమియం చెల్లించాలని స్పష్టం చేసింది. ప్రీమియం చెల్లిస్తే గానీ విపత్కర పరిస్థితుల్లో బీమా వర్తించదని, ఈ నెలాకరులోపు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారులు చెప్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలుగా బాసటగా నిలిచింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు సరఫరా చేయడమేగాక పంటలు అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు- సలహాలు వ్యవసాయాధికారులతో ఇప్పించింది. పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేసింది. సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ చేయించిన ప్రతి రైతుకు ఉచిత పంటల బీమాను అమలు చేసింది. కానీ ప్రస్తుతం కూటమి దీనికి పూర్తిగా మంగళం పాడింది.

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి



అన్నదాత సుఖీభవ కింద సాయం చేయలేదు. కనీసం ఉచిత పంటల బీమా అయినా అమలు చేయాలి. గతంలోలాగే ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించి ఆదుకోవాలి. పెట్టుబడికి డబ్బులు లేక రైతన్నలు అవస్థలు పడుతున్నారు. ఎన్నికల హామీ మేరకు పెట్టుబడి సాయం అందజేయాలి.

– గోపాల్, రైతు, కమలపాడు

హామీలు అమలు చేయాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఏటా రూ. 20 వేలు ఆర్థిక సాయం రైతులకు అందించాలి. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్తం ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేయటం రైతులకు భారంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

– మేకల సిద్దప్ప, మోపిడి సర్పంచ్

మున్సిపాలిటీ అభివృద్ధికి పూర్తిగా సహకారం



కళ్యాణదుర్గం టీసర్కిల్లో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



పాలవాయి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామంటే తాము పూర్తిగా సహకారం అందిస్తామని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. టీసర్కిల్లోని టీ షాప్‌లో పార్టీ నాయకులతో కలిసి టీ తాగారు. అనంతరం గాంధీచౌక్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ప్రధాన రోడ్డు పక్కన ఉన్న స్థలాన్ని టీడీపీ నేతలు ఆక్రమించుకొని షాపులు నిర్మించుకున్న స్థలాన్ని పరిశీలించారు.

ఎమ్మెల్యే అక్రమాలకు సహకరించేదిలేదు..

అనంతరం పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తన సొంత నిధులతో కళ్యాణదుర్గం దశ దిశ మారుస్తానన్న ఆగర్భ శ్రీమంతుడు ఎమ్మెల్యే అమిలినేని ప్రజలను మభ్యపెట్టారన్నారు. మూడు నెలలుగా తాగునీరు అందించలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వ నాయకులు ఉన్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో కౌన్సిల్ సమావేశం వాయిదా వేసిన మున్సిపల్ అధికారులు... మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్‌తోపాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సహకరించడంలేదని విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేకు మున్సిపల్ కమిషనర్ తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేకు మున్సిపాలిటీని అభివృద్ధి చేయడం చేతకాక వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన..

కళ్యాణదుర్గంలోని టీసర్కిల్ సమీపంలో ప్రధాన రోడ్డుపై నిర్మాస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మాజీ ఎంపీ పరిశీలించారు. చిన్న బ్రిడ్జి కట్టడానికి పోలవరం ప్రాజెక్టు తరహాలో నెలల తరబడి ఆలస్యం చేస్తున్నారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో చిరువ్యాపారులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, కన్వీనర్లు ఈడిగ సుధీర్, గోళ్ల సూరి, ఎంఎస్ హనుమంతురాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, కదిరిదేవరపల్లి హనుమంతురాయుడు, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతురెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, కోఆప్షన్ మెంబర్ అబ్జల్, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు బోరంపల్లి రామిరెడ్డి, కృష్ణారెడ్డి, బిక్కిహరి, టైలర్ శీనా, యుత్ వింగ్ చరణ్, ప్రకాష్, షేక్షా, తిప్పేస్వామి, వెంకటేశులు, నరేంద్రరెడ్డి, పాతలింగ, ప్రతాంప్, అశోక్ రెడ్డి, చరణ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

కళ్యాణదుర్గం రూరల్: ఎవరూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి భరోసా కల్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ నేత హనుమంతరాయుడు మృతి చెందిన విషయం తెలిసిందే. గురవారం మండల పరిధిలోని పాలవాయి గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీటీకి మద్దతుగా పోస్టుకార్డుల ఉద్యమం



పోస్టుకార్డులతో ర్యాలీ చేస్తున్న కళాశాల విద్యార్థులు

కూడేరు: మండల పరిధిలోని జయపురం, చోళసముద్రం గ్రామాల్లో గురువారం ఆర్డీటీకి మద్దతుగా మహిళలు పెద్ద ఎత్తున పోస్టుకార్డుల ఉద్యమంలో పాల్గొన్నారు. మహిళలు మాట్లాడారు. ప్రభుత్వాలు ద్వారా కన్నా ఆర్డీటీ ద్వారానే ఎక్కువగా లబ్ధి పొందామన్నారు. నిస్వార్థంతో సేవలందిస్తున్న ఆర్డీటీ లేకపోతే పేదలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కాబట్టి కేంద్రం ఆర్డీటీపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు హోంమంత్రి అమిత్‌షాకు పోస్టుకార్డుల్లో రాసి పంపారు. కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు అక్కమ్మ, సంజీవరాయుడు, రమణ, ముత్యాలు పాల్గొన్నారు.

ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ ర్యాలీ

కుందుర్పి: ఆర్డీటీని పరిరక్షించాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, మాజీ సర్పంచ్ కరిగానిపల్లి తిప్పేస్వామి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ చేశారు. మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సభ్యులు లింగప్ప తదితరులు ఆధ్వర్యంలో ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని మండల కేంద్రంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వెంకటేషులు తదితరులు ఉన్నారు.

బొమ్మనహాళ్: ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని విద్యార్థులు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు పోస్టుకార్డులు రాశారు. కార్యక్రమంలో ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు నాగార్జున, రాజశేఖర్, పవన్‌కుమార్, రవిచంద్ర, సాగర్, వన్నూరుస్వామి, ప్రభు పాల్గొన్నారు.

ఉరవకొండ: ఆర్డీటీ పరిరక్షణ సమితి జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో 700 పోస్టుకార్డులను రాయించారు. సేవ్ ఆర్డీటీ పేరుతో కేంద్ర హోం మంత్రి చిరునామాకు పంపించారు. జేఏసీ నాయకులు మీనుగ గోపాల్, పాల్తూరు ఆనంద్‌రాజు మాట్లాడారు.

‘దుర్గం’లో కుక్కలు చంపిన గొర్రెల మటన్

కళ్యాణదుర్గం/రూరల్: కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెల మటన్‌ను విక్రయిస్తున్న వ్యాపారిపై కళ్యాణదుర్గం వాసులు తిరగబడ్డారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇటీవల కుక్కల దాడిలో గాయపడి మృతి చెందిన గొర్రెల మటన్‌ను మార్కెట్‌లో ప్రకాష్ అనే వ్యాపారి విక్రయిస్తుండడంతో గమనించిన స్థానికులు నిలదీశారు. దీంతో స్థానికులపై మటన్ సెంటర్ నిర్వాహకుడు దురుసుగా వ్యవహరించడంతో పరిస్థితి అదుపు తప్పింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడకు చేరుకుని గొర్రె మాంసంపై ఫినాయిల్ చల్లి విక్రయాలను అడ్డుకున్నారు. ఇలాంటి మటన్‌ను విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వారిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరారు.

ఉద్యాన పథకాలు సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం: పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అమలు చేయాల్సిన పథకాలపై తెలియజేశారు. ఎంఐడీహెచ్, ఆర్కేవీవై పథకం కింద ఫారంపాండ్లు, ప్యాక్ హౌస్‌లు, సోలార్ కోల్డ్ రూమ్స్, కోల్డ్ రూంలకు, మామిడి, చీనీ, దానిమ్మ, నేరేడు తదితర పంటలకు రాయితీ వర్తిస్తుందన్నారు. పంటల బీమా కింద ఎకరాకు అరటి రూ.3 వేలు, టమాటా రూ.1,600, దానిమ్మ రూ.3,750, చీనీ రూ.2,750 పంటలకు ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు ఈనెల 31లోపు కామన్ సర్వీస్ సెంటర్ లేదా మీ సేవ లేదా సచివాలయంలో ప్రీమియం చెల్లించాలన్నారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కూడేరు: స్థానిక కుష్ఠు రోగుల కాలనీ సమీపంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై గురువారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని నగరానికి చెందిన నాగభూషణ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. నాగభూషణ్ ద్విచక్ర వాహనంపై కూడేరు నుంచి వెళ్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు.

27న కంటి, గుండె పరీక్ష శిబిరం

రాయదుర్గంటౌన్: ఈనెల 27న స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొ్రేష్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం జరుగుతుందన్నారు.

సంక్షిప్త సమాచారం

పిల్లలపల్లిలో మహాకవి గుర్రం జాషువా వర్ధంతి

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో మహాకవి గుర్రంజాషువా వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. హెచ్‌ఎం అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, చిన్న వన్నప్ప, రామాంజనేయులు, చంద్రశేఖర్, గోపాల్‌నాయక్, శ్రీనివాసులు, జగన్, మాధవి, రాధ, హేమావతి, అలివేలమ్మ, భావన పాల్గొన్నారు.

అర్హత ఆధారంగా ప్రవేశాలు కల్పించాం

బ్రహ్మసముద్ర: బయటి వ్యక్తులను నమ్మి ఎవరూ మోసపోవద్దని కేజీబీవీ ఎస్ఓ మహాలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ కేజీబీవీలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఓ మహిళ బయట వ్యక్తులను నమ్మి మోసపోయిందని, ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యిందని, పత్రికల్లోనూ వార్తలు ప్రచురితమయ్యాయని అన్నారు. తమ పాఠశాలలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ బయటి వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రంలో ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్‌ను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, ఎంఆర్‌పీఎస్ నాయకులు తిమ్మరాజు, ఎం.నాగరాజు, ఇషాక్, వన్నూరుస్వామి, నాగరాజు, ప్రభాకర్, కొల్లప్ప, గోపాల్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

కణేకల్లు: అవినీతికి పాల్పడిన కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెల ప్రసాద్ ఆర్‌ఐఓ వెంకటరమణనాయక్‌ను గురువారం అనంతపురంలో కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి

బొమ్మనహాళ్: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ సూచించారు. గురువారం మండలంలోని దర్గాహొన్నూరులో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్దకు పంపించాలన్నారు. డోర్ టు డోర్ గార్బేజీ కలెక్షన్ రోజూ అన్ని గ్రామ పంచాయతీల్లో విధిగా నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు ఉండరాదని, అలాంటి చెత్తకుప్పలు ఉంటే వాటిని వెంటనే చెత్త సంపద తయారీ కేంద్రం వద్దకు తరలిమస్తాని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్, పంచాయతీ కార్యదర్శి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఉపశమనం

రాయదుర్గం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో గురువారం చిరుజల్లులు పడ్డాయి. వర్షం లేక ఎండుముఖం పట్టిన ఖరీఫ్ పంటలకు కాస్త ఊరట లభించింది. మరో రెండు రోజులు ఇలాగా ఉండొచ్చని వాతావరణశాఖ ప్రకటించడంతో బోరుబావుల కింద సాగులోకొచ్చిన వరి నారు మడులు, టమాట, మిర్చి, ఉల్లి రైతులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతవాసులు జాగ్రత్త పడుతున్నారు.

చౌడేశ్వరిదేవీ నమోస్తుతే



రాయదుర్గంలో పూజలందుకున్న చౌడేశ్వరిదేవి



ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారి పల్లకి ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి
- భక్తులతో కిటకిటలాడిన ఉరగాద్రి ఆలయం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అమ్మవారికి సహస్ర లలిత నామార్చన చేశారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, తహసీల్దార్ నాగరాజు, ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్ పరీక్షలకు ఉత్తమ ఫలితాలు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. **ఉరవకొండ:** చౌడేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయంతో పాటు పురామనుకట్ట చౌడేశ్వరి, 11 వార్డు రామలింగచౌడేశ్వరి, చౌడేశ్వరి కాలనీలోని చౌడేశ్వరి, 4వ వార్డులో వెలసిన పెద్దచౌడేశ్వరి ఆలయాల్లో జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే పెద్ద ఎత్తున క్యూ కట్టారు. ఆలయ చైర్మన్ కొత్త శరత్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మందికి అన్నదానం చేశారు.

పల్లకీ ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎంపీ

ఉరవకొండలోని ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాల్లో మాజీ ఎంపీ తలారి రంగయ్య పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కొత్త శరత్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీకి స్వాగతం పలికారు. పల్లకీ ఉత్సవంలో మాజీ ఎంపీతో పాటు ఎంపీపీ నరసింహులు, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, పార్టీ జిల్లా నేతలు లత్తవరం గోవిందు, మూలగిరిపల్లి ఓబన్న, సుద్దాల వెంకటేష్, ఆర్‌సీ ప్రసాద్, లక్కా ఎర్రిస్వామి, మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి సౌజన్యంతో గుండె సంబంధిత జబ్బులు, 2డీ ఎకో పరీక్షలు, కార్డియాలజీ, యురాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ సేవలు అందించారు.

యానిమేటర్, సీసీలపై పోలీసులకు ఫిర్యాదు



వెలుగు ఏపీఎం సురేఖను నిలదీస్తున్న కోనాపురం మహిళా సంఘ సభ్యులు

బెళుగుప్ప: కోనాపురానికి చెందిన రుద్రమదేవి, శ్రీమంజునాథ మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లోని నగదు యానిమేటర్ బంధువులు కుటుంబ సభ్యుల రుణాల బ్యాంకు కంతులకు జమ చేసుకోవడంపై వెలుగు ఏపీఎం సురేఖను సభ్యులు గురువారం నిలదీశారు. యానిమేటర్, సీసీలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు గ్రామంలోని యానిమేటర్ మల్లికార్జున బంధువులు చిట్టెమ్మ, గీతమ్మ పేరున రూ.2 లక్షలు చొప్పున బ్యాంకు రుణం తీసుకున్నారు. రుణాలకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కంతులను చెల్లించక పోవడంతో శ్రీమంజునాథ, రుద్రమదేవి మహిళా సంఘాల నుంచి రూ.45 వేలు, రూ.22 వేలు చొప్పున సభ్యుల పొదుపు ఖాతాల నుంచి బ్యాంకర్లు జమ చేసుకున్నారు. దీనిపై ఏపీఎం, సీసీల పాత్ర ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో యానిమేటర్ రూ.30 లక్షల వరకు అవినీతికి పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాలు శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం ఆయా మండల కేంద్రాల్లో జరుగుతాయని పార్టీ ముఖ్య నేతలు గురువారం తెలిపారు. వజ్రకరూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మోనాలీసా, ఉపాధ్యక్షులు ఉస్మాన్, రవికాంత్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రామాంజనేయులు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వజ్రకరూరులోని కమలపాడు రాజశేఖర్‌రెడ్డి జిన్నాలో సమావేశం ఉంటుందన్నారు. ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఉరవకొండ, ఉరవకొండ రూరల్ విస్తృత స్థాయి సమావేశాలు జరు గుతాయని, విడపనకల్లు మండల కేంద్రంలో గౌరమ్మ బావి సమీపంలో సమావేశాలు జరుగుతాయన్నా రు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కుందుర్పి: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఏడీఏ ఎల్లప్ప, సిరికల్చర్ ఏడీ శైలజ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ తిప్పేస్వామి, ఏఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న ఎంఈఎఫ్ మహాసభ

కళ్యాణదుర్గం: పట్టణంలోని కరణం చిక్కప్ప పాఠశాలలో ఈనెల 27న మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా మహాసభ (ఎంఈఎఫ్) జరుగుతుందని ఎంఈఎఫ్ నాయకులు తెలిపారు. గురువారం ఉపాధ్యాయుడు రాంపురం భాస్కర్ నివాసంలో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్ హాజరవుతారన్నారు. ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, తాలూకా అధ్యక్షుడు ఎంపీ ఎర్రిస్వామి, ప్రధాన కార్యదర్శి ఎనుముల చిరంజీవి, కోశాధికారి జీఆర్ మహేష్, తాలూకా ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, సభ్యులు వన్నూరుస్వామి పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ మహాసభ పోస్టర్ల విడుదల

రాయదుర్గంటౌన్: కళ్యాణదుర్గంలో ఈ నెల 27న జరగనున్న మాదిగ ఉద్యోగుల మహాసభ (ఎంఈఎఫ్) జయప్రదం చేయాలని ఎంఈఓ ప్రతినిధులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఎంఈఓ ఉద్యోగులు పోస్టర్లను విడుదల చేశారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం నియోజకవర్గాల సభను కళ్యాణదుర్గంలో 27న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పేస్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు వన్నూరుస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, హనుమంతు, నాగేంద్ర, ఓబులేసు, నరసింహులు, గోపాల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌పై సైబర్ వల

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్‌పై సైబర్ నేరగాళ్లు వల విసిరారు. అయితే ఆయన తెలివిగా వ్యవహరించడంతో వల నుంచి తప్పించుకున్నారు. గతేడాది ఫోన్ కాల్ చేసి రూ.25 వేలు దోచుకున్న విషయం మరువకనే తాజాగా గురువారం 99915 17668 నంబరు నుంచి కాల్ వచ్చింది. ‘మీ అమ్మకు సంబంధించిన పెన్షన్ వచ్చింది. బ్యాంకు లింక్ లేదు. మీ అకౌంట్‌కు వేస్తాం. మీ అకౌంట్ నంబరు చెప్పండి’ అని అవతలి వ్యక్తి అడిగాడు. దీంతో నంబర్ చెప్పిన తర్వాత నగదు బదిలీ కావడం లేదని, ఫోన్ పే నంబర్‌కు వేస్తాం ఫోన్ పే యాప్ ఓపెన్ చేయాలని సూచించాడు. దీంతో మారుతీప్రసాద్‌కు అనుమానం వచ్చి మందలించి ఫోన్ కట్ చేశాడు. అనంతరం విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు పరిశీలించి అది సైబర్ నేరగాళ్ల పనిగా నిర్ధారించారు.